సాక్షి
అనకాపల్లి
శుక్రవారం : 18 ఏప్రిల్ : 2025



వాకలపల్లిలో చేతులు జోడించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

10లో

ఆగని మృత్యుఘోష

- కైలాసపట్నం పేలుడులో గాయపడిన మరొకరు మృతి


రోదిస్తున్న మృతుని కుటుంబసభ్యులు


మృతుడు జల్లూరి నాగరాజు (ఫైల్)

కోటవురట్ల: గుండెల్లో మంటలు ఆరలేదు.. ఇంకా కన్నీళ్లు ఇంకలేదు.. కైలాసపట్నం మరోసారి గొల్లుమంది. బాణసంచా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజు నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. కైలాసపట్నంలోని విజయలక్ష్మి గణేష్ ఫైర్ క్రాకర్స్‌లో ఆదివారం జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందగా మరో 8 మంది గాయపడిన సంగతి తెలిసిందే. అందులో రాట్నాలపాలేనికి చెందిన జల్లూరి నాగరాజు (50) 90 శాతం కాలిన గాయాలతో విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మెడికవర్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి గణేష్ క్రాకర్స్ మేనేజర్ మడగల జానకీరాం పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. నాగరాజు మృతదేహం విశాఖ నుంచి కోటవురట్ల శివారు రాట్నాలపాలేనికి సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంది. ఉదయమే నాగరాజు మృతి చెందిన సంగతి గ్రామంలో తెలియడంతో విషాదఛాయలు అలముకున్నాయి. వివాద రహితుడు, అందరితో మంచిగా తిరిగే నాగరాజు మృతి అందరినీ కన్నీరు పెట్టించింది. భార్యా పిల్లలు గుండెలవిసేలా రోదించారు. మృతుడికి భార్య అప్పలనర్స, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె మౌనిక ఉన్నారు. రోదనల మధ్య నాగరాజు అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

అవార్డు అందుకున్న విద్యార్థులకు సత్కారం


ఉత్తమ విద్యార్థులను సత్కరించిన ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి, అధ్యాపకులు జి.చిన్నారావు, శర్మ గురువారం సత్కరించారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఎంఎల్టీ విద్యార్థిని సిరసపల్లి హరిత 989 మార్కులు, బ్యాంకింగ్ అండ్ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులో మాళి కిరణ్ 978 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. వీరిద్దరినీ ఘనంగా సత్కరించారు. అధ్యాపకుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని ప్రిన్సిపాల్ అన్నారు.

24 నుంచి తొలి విడత చందనం అరగదీత



సింహాచలం: ఈ నెల 24 నుంచి సింహగిరిపై తొలి విడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 30న చందనోత్సవంనాడు నిజరూప దర్శనం అనంతరం తిరిగి స్వామికి మూడు మణుగు(125 కిలో)ల పచ్చి చందనాన్ని సమర్పించనున్నారు. దీనిలో భాగంగా 24న ఉదయం 6.30కు తొలిచందనం చెక్కకు పూజలు నిర్వహించి, అరగదీతను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 7.30 నుంచి దర్శనాలు మొదలవుతాయని పేర్కొన్నారు. సంవత్సరంలో 364 రోజులపాటు చందనంలో ఉండి దర్శనమిచ్చే స్వామి, వైశాఖ శుద్ధ తదియ రోజు మాత్రమే నిజరూప దర్శనం కల్పిస్తాడు. అదే రోజు అర్ధరాత్రి తర్వాత తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించి, నిత్యరూపభరితున్ని చేస్తారు. మళ్లీ వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) తీసుకున్న ఉద్యోగులకు గురువారం గ్రాట్యుటీ చెల్లించారు. స్టీల్‌ప్లాంట్ నుంచి 1,126 మంది వీఆర్ఎస్ తీసుకున్న విషయం విదితమే. చివరి రోజు మార్చి 31న యాజమాన్యం అందరికీ వీఆర్ఎస్ అమౌంట్‌ను చెల్లించింది. లీవ్‌లు తక్కువగా నిల్వ ఉన్న ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు ప్రారంభించింది. మిగిలిన ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చెల్లింపుల కోసం యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. తక్కువ ఉన్న వారికి ముందుగా చెల్లించేందుకు చూస్తోంది.


ఉపాధి హామీ మేట్‌ను తొలగించి కూటమి నేతలకు అనుకూలంగా ఉన్న మరో వ్యక్తిని నియమించడంపై చీడికాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం కూలీల నిరసన

మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం బైలపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ మేట్‌ను తొలగించారు. తమకు తెలియకుండా తొలగించమేమిటని ఉపాధి కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని, ఆ పార్టీ సానుభూతిపరులనే అక్కసుతో 38 సభ్యులు గల చంద్రాదేవి గ్రూపునకు మేట్‌గా వ్యవహరిస్తున్న జాజిమొగ్గల చంద్రదేవిని తప్పించడం వివాదాస్పదమైంది. ఈ విషయం మండల ఏపీవో దృష్టికి తీసుకెళ్లినా నిబంధనలకు విరుద్ధంగా మార్చారు. ఈ మండలంలో మంచ్యాల గ్రామంలో కూడా మరో మేట్‌ను ఇదే విధంగా నిబంధనలను **పట్టించుకోకుండా తొలగించారు.**

స్పీకర్ సీహెచ్ అయ్యన్న పాత్రుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో దారుణాలు అన్నీ ఇన్నీ కావు. మాకవరపాలెం మండలంలో స్పీకర్ ఒత్తిడితో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉన్న గ్రూపులను రిజిస్టర్ చేయలేదు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే అక్కసుతో 350 కూలీలకు పని కల్పించలేదు. గడిచిన మూడు నెలల నుంచి ఉపాధి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల తీరుపై నిరసనలు, ధర్నాలు చేసినా ఫలితం శూన్యం. అడిగర్లపాలెంలో 3 గ్రూపులు, పాతలూరు గ్రామంలో 2 గ్రూపులు, మామిడిపాలెం 4 గ్రూపుల్లో వైఎస్సార్‌సీపీ మేట్లు ఉండడంతో పని **కల్పించలేదు.**

హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు, 10 మంది మేట్లను తొలగించారు.

ఉపాధిలోనూ పచ్చపాతమే..

కూలీలతోనూ రాజకీయమే..


మాకవరపాలెం మండలం మామిడపాలెంలో పనులు కల్పించలేదని నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

- జిల్లావ్యాప్తంగా 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 60 మంది మేట్లపై వేటు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే అక్కసుతో నిబంధనలకు విరుద్ధంగా తొలగింపు
- మామిడపాలెంలో వైఎస్సార్‌సీపీకి ఓటేశారని 350 మంది కూలీలకు పని కల్పించని వైనం
- పలు గ్రామాల్లో ఉపాధి కూలీలు నిరసన తెలిపినా పట్టించుకోని అధికారులు

సాక్షి, అనకాపల్లి:

ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనుల్లో కూటమి నేతల జోక్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు వస్తే థర్డ్ పార్టీ విచారణ, క్వాలిటీ కంట్రోల్ ఎంక్వైరీ చేసి తప్పు చేసినట్టు రుజువైతే అప్పుడు నిబంధనల ప్రకారం సస్పెండ్ చేయాలి. కానీ కూటమి నేతలు తొలి నుంచి క్రిమినల్ కేసులు బనాయించడం, అక్రమంగా తొలగించడం, బెదిరింపులకు పాల్పడి వారంతట వారే రాజీనామా చేసేలా చేయడం వంటి వాటి అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఇక గ్రూప్‌లో ఉండే కూలీల్లో మెజారిటీ ఎవరికి మద్దతు ఇస్తారో వారే మేట్‌గా ఉండాలి. మెజారిటీ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నారు. కాదని ఎదురు తిరిగితే ఆ గ్రూపులకు ఉపాధి పనులు లేకుండా నిలిపివేస్తున్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఉపాధి పనులు కల్పించకుండా వెనక్కి పంపిస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సీనియారిటీని పరిగణించని వైనం

పాయకరావుపేట మండలంలో ఈదటం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా 16 ఏళ్లుగా పనిచేస్తున్న మేకా సోమయ్యపై క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగించారు. ఏడేళ్లుగా పని చేస్తున్న గోపాలపట్నం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పి.వర్మ, పెద రామభద్రపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా 9 ఏళ్లుగా పనిచేస్తున్న పుష్పలతను తొలగించారు. 16 ఏళ్లుగా శ్రీరాంపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బత్తిన శ్రీనివాస్, 16 ఏళ్లుగా నామవరం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసరి సీతారామస్వామిని, 9 ఏళ్లుగా మాసాహెబ్‌పేట ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజును తొలగించారు. పాయకరావుపేట మండలంలో 10 మంది మేట్లను తొలగించారు. మరో 20 మందిపై రాజకీయ కక్షలో భాగంగా తీసేందుకు కుట్ర పన్నుతున్నారు.

రాజకీయ కక్షసాధింపు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధి హామీ పథకం అమలులో రాజకీయ జోక్యం, వీఆర్‌పీ (ఫీల్డ్ అసిస్టెంట్లు)లపై పెత్తనం పెరిగిపోయింది. గత ఏడాది జూన్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే... ఆయా పార్టీల ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఉపాధి హామీ పథకంలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లను పెద్ద ఎత్తున తొలగించేలా చేశారు. క్షేత్రస్థాయిలో కూలీలకు పనులు కల్పించే ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ పార్టీల కార్యకర్తలను నియమించుకున్నారు.

కొత్తగా వచ్చిన వారికి ఉపాధి హామీ పథకం అమలుపై అవగాహన లేకపోవడంతోపాటు వాళ్ల గ్రామ రాజకీయాలకు ప్రభావితమై ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులకు పనులు లేకుండా చేస్తున్నారు.



స్పీకర్ అయ్యన్న ఇలాకాలో మేట్ల తొలగింపు

నర్సీపట్నం నియోజకవర్గంలో ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు 30 మందికి పైగా మేట్లను తొలగించారు. గొలుగొండ మండలంలో పుత్తడిగైరంపేట ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు. మాకవరపాలెం మండలం భీమబోయనపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదరించడంతో రాజీనామా చేశాడు. మాకవరపాలెం మండలంలో మామిడిపాలెం గ్రామంలో అర్హత ఉన్న ఏడుగురు మేట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారు. కూటమి నేతల సిఫార్సులతో అర్హత లేకున్నా కూటమి పార్టీ అనుకూలస్తులను మేట్లుగా ఎంపిక చేస్తున్నారు. అధికారులు అవలంబిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రిమినల్ కేసులు బనాయించి మరీ తొలగించారు..



కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే హోం మంత్రి అప్పటి డ్వామా పీడీ సందీప్‌పై ఒత్తిడి తెచ్చి, మాకు ఫోన్ చేయించి రాజీనామా చేయాలని చెప్పించారు. నేను అంగీకరించకపోవడంతో 16 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాపై క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగించారు. నాతో పాటు నామవరం, శ్రీరాంపురం ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా భయపెట్టి తప్పించారు. మిగతా వారిని నెల రోజుల తరువాత తొలగించారు. నిజంగా నేను తప్పు చేస్తే..అదే మస్టర్ షీటుపై సంతకాలు చేసే ఎంపీడీవో, క్వాలిటీ కంట్రోల్ అధికారి, ఏపీవో, డ్వామా పీడీ, టెక్నికల్ అసిస్టెంట్ అందరూ తప్పు చేసినట్లే. వారిని కూడా తొలగించాలి.

– **మేకా సోమయ్య**, ఫీల్డ్ అసిస్టెంట్, ఈదటం గ్రామం, పాయకరావుపేట నియోజకవర్గం

గ్రూప్‌లో మెజారిటీ ఉన్నా.. మేట్‌ను రిజిస్టర్ చేయలేదు..



మాది మాకవరపాలెం మండలం మామిడిపాలెం గ్రామం. మా గ్రూప్‌లో 50 మంది ఉపాధి కూలీలున్నారు. వీరిలో మెజారిటీ 25 మంది కన్నా ఎక్కువగా కూలీలు మద్దతుంటే.. మేట్‌గా రిజిస్టర్ చేయాలి. నాకు 30మందికి పైగా కూలీల మద్దతు ఉంది. అయినా మేట్‌గా రిజిస్టర్ చేయలేదు. ఇలా 7 గ్రూపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మేట్లను నియమించారు. అధికారులు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యమిస్తాం.

– **అడిగర్ల అప్పలనాయుడు**, మేట్, మామిడపాలెం గ్రామం, మాకవరపాలెం

కూలీల మద్దతు ఉన్నా తొలగించారు..



మా గ్రూపు 38 కూలీలందరూ నాకే మద్దతుగా ఉన్నారు. కానీ మా గ్రామ వీఆర్‌పీ నన్ను అక్రమంగా తొలగించారు. కేవలం నేను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు కావడంతోనే ఇలా చేశారు. దీనిపై మా గ్రూపు కూలీలందరితో కలిసి ఎంపీడీవోకి ఫిర్యాదు చేశాం. రెండు రోజుల్లో విచారణ ఉంటుందని చెప్పారు. అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళతాను.

– **జాజిమొగ్గల చంద్రాదేవి**, బైలపూడి గ్రామం మేట్

ఆత్మహత్యే శరణ్యం..



వైఎస్సార్‌సీపీకు ఓటు వేశారనే అక్కసుతోనే మేట్‌లకు రిజిస్ట్రేషన్‌లు చేయలేదు. మూడు నెలలుగా పనిలేక మా మామిడపాలెం పంచాయతీలో 350 మంది కూలీలం ఇబ్బందులు పడుతున్నాం. కూటమి నేతల ఒత్తిడితో అధికారులు తొత్తులుగా మారుతున్నారు. కూలీనాలీ లేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారుల్లో మార్పు రాకపోతే మాకు ఆత్మహత్యే శరణ్యం.

– **కచ్చాల కమల**, మేట్, మామిడిపాలెం గ్రామం

విప్ ధిక్కరిస్తే రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టే..

- ఫ్యాన్ గుర్తుతో గెలిచిన ఫిరాయింపుదారులకు హెచ్చరిక
- బీసీ మహిళా మేయర్‌ను తొలగించేందుకు కూటమి కుట్రలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నేతలు


కలెక్టర్‌కు మెమొరాండం అందిస్తున్న మాజీ మంత్రి గుడివాడ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, తైనాల, వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ గుర్తుపై విజయం సాధించి, ఇప్పుడు పార్టీ ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్లు విప్ ధిక్కరిస్తే.. మరో 48 గంటలు మాత్రమే వారికి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. 19న అవిశ్వాస తీర్మానంపై జరిగే కౌన్సిల్ సమావేశాన్ని స్నేహపూర్వక వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని గురువారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అవిశ్వాస తీర్మానంపై కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని.. దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్‌ను కోరామన్నారు. మీడియా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో సమావేశం జరగాలని, అసాంఘిక శక్తులను అనుమతించకూడదన్నారు. కూటమి నేతలు వైస్రాయ్ హోటల్ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అనుకున్న సంఖ్యాబలం లేకపోయినా హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను చివరి నిమిషం వరకు ప్రలోభాలు, బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ తరపున విప్ జారీ చేస్తామని, ఈ మేరకు లేఖను కూడా కలెక్టర్‌కు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచిన వారు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని విప్ జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. విప్ ధిక్కరిస్తే వాళ్ల బతుకు కుక్కలు చింపిన విస్తరేనని హెచ్చరించారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి టీడీపీలో చేరిన 23 మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఏమైందో కార్పొరేటర్లు గుర్తెరగాలని సూచించారు. రాజకీయ జీవితం, భవిష్యత్తు కావాలనుకునేవాళ్లు ఇలాంటి పనులు చేయరని స్పష్టం చేశారు. నిజంగా వారికి దమ్ముంటే.. పార్టీకి, పార్టీ ద్వారా వచ్చిన పదవులకు కూడా రాజీనామాలు చేయాలని అమర్‌నాథ్ సవాల్ విసిరారు. పొరపాటున ఎవరైనా ఓటేస్తే విప్ ధిక్కరణకు గురై పదవులను కోల్పోతారని హెచ్చరించారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై గెలిచి విప్‌ను ధిక్కరించిన వారిపై 24 గంటల్లో న్యాయపరమైన చర్యలు తప్పవన్నారు. చంద్రబాబు ఎన్ని క్షుద్ర రాజకీయాలు చేసినా.. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన స్థానిక పీఠాలను దక్కించుకునేందుకు ఎంతకైనా దిగజారుతోందన్నారు. విప్ ధిక్కరిస్తే కార్పొరేటర్ పదవి కోల్పోవడంతో పాటు ప్రజల నుంచి తిరస్కరణకు గురవుతారన్నారు. బీసీ మహిళను 11 నెలల కాలం కూడా మేయర్ పీఠంపై ఉండనీయకుండా కుట్రలు పన్నుతుండటం దురదృష్టకరమన్నారు.

ఐజీ శ్రీనివాస్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం


ఐజీ శ్రీనివాస్‌కు అవార్డు అందజేస్తున్న కేంద్ర హోం మత్రి అమిత్ షా

ఆరిలోవ (విశాఖ): విశాలాక్షినగర్ కేంద్రంగా ఉన్న కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) ఆరాధ్యుల శ్రీనివాస్ ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ పతకం అందుకున్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన సీఆర్పీఎఫ్ 86వ వార్షికోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఆయన ఈ పతకం స్వీకరించారు.

34 ఏళ్లుగా శ్రీనివాస్ అందిస్తున్న సేవలు, ఆయన నాయకత్వ పటిమ, నిబద్ధత, దేశ భద్రతకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. స్థానికుడైన ఐజీ శ్రీనివాస్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల సీఆర్పీఎఫ్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పన్న పట్టు వస్త్రాలకు రూ.20 వేలు

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి(దేవదాయశాఖ) వి.వినయ్‌చంద్ గురువారం జీవో జారీ చేశారు. స్వామికి సమర్పించే పట్టువస్త్రం కొనుగోలుకు రూ.20 వేలు మంజూరుచేసినట్లు జీవోలో పేర్కొన్నారు.

న్యాయం కావాలి

- పెట్రోల్ బాటిల్‌తో సెల్ టవర్ ఎక్కిన 'రెవెన్యూ' బాధితుడు
- అన్యాయంగా తన స్థలం వేరొకరి పేరుతో రిజిస్టర్ చేశారని ఆవేదన
- పదేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపణ
- రెవెన్యూ అధికారుల హామీతో శాంతించిన శంకర్రావు


ఆందోళనగా టవర్ వద్దకు చేరుకున్న ప్రజలు (ఇన్‌సెట్) పెట్రోల్ బాటిల్, లైటర్‌తో సెల్ టవర్ ఎక్కి కూర్చున్న హరి నాగ శంకర్రావు

అచ్యుతాపురం రూరల్: కొంతమంది ప్రభుత్వ అధికారుల స్వార్థం వల్ల ఎన్నో నిండు జీవితాలు రోడ్డున పడుతున్నాయని లంక ధర్మవరం గ్రామానికి చెందిన లంక హరినాగ శంకర్రావు ఆవేదన చెందాడు. తరతరాలుగా అదే ఇంట్లో ఉంటూ.. తమ పొలాల్లో సాగు చేసుకుంటూ జీవనం గడిపే సమయంలో ఒక్కసారిగా.. ఇది మీ భూమి కాదు, మీరు నివసిస్తున్న ఇంట్లో నుంచి వెళ్లిపోవాలి.. అనడంతో తనకు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితి నెలకొందని శంకర్రావు వాపోయాడు. తన స్థలం మరొకరి పేరిట రిజిస్టర్ చేశారు, న్యాయం చేయమని పది సంవత్సరాలుగా నాయకులు, అధికారుల వద్దకు తిరిగి అలసి విసుగు చెంది తనకు న్యాయం జరగదని భావించిన శంకర్రావు గురువారం ఉదయం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ పైకి ఎక్కి నిరసన తెలియజేశాడు. తనతోపాటు పెట్రోల్ బాటిల్, లైటర్ తీసుకువెళ్లి కాల్చుకొని మరణిస్తానని బెదిరించాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ ఫోన్ చేసి మాట్లాడగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు సెల్ ఫోన్ టవర్ దిగాడు. అనంతరం తహసీల్దార్ లంక ధర్మవరం గ్రామానికి చేరుకుని తగాదాల్లో ఉన్న భూములపై విచారణ చేపట్టారు. భూ రికార్డులు తారుమారు చేసిన అప్పటి తహసీల్దార్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇటువంటి అనేక భూ సమస్యలు మండలంలో కోకొల్లలుగా ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవట్లేదన్నారు.

స్పీకర్ డాన్స్ చేస్తే ఒప్పు.. సర్పంచ్‌లు డాన్స్ వేస్తే తప్పా?

10లో

క్లుప్తంగా

నర్సరీలను పరిశీలించిన పీసీసీఎఫ్ శ్రీధర్



నర్సరీని పరిశీలిస్తున్న విజిలెన్స్ పీసీసీఎఫ్ శ్రీధర్

నర్సీపట్నం: స్థానిక అటవీ డిపో ఆవరణలో పెంచుతున్న సోషల్ ఫారెస్ట్ నర్సరీలను విజిలెన్స్ పీసీసీఎఫ్ ఎస్.శ్రీధర్ గురువారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా నర్సీపట్నం విచ్చేసిన సందర్భంగా నర్సరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీలో పెంచుతున్న పండ్ల జాతుల మొక్కలు, వివిధ రకాల మొక్కల గురించి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్ పీసీసీఎఫ్‌కు వివరించారు. తక్కువ ధరకు మొక్కలు విక్రయించడంతో పాటు ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో వేసిన ప్లాంట్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎఫ్‌వో శామ్యూల్, కన్జర్వేటర్ ఎం.దివాన్, చింతపల్లి డీఎఫ్‌వో నర్సింహరావు, రేంజర్ లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

చెరకు పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్

కె.కోటపాడు: గతేడాది తరలించిన చెరకు బకాయిలను గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో గురువారం ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించనున్నట్లు కూటమి ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఫ్యాక్టరీ ఆధునికీకరణ చర్యలు చేపట్టకపోవడం వల్ల క్రషింగ్ లక్ష్యం లక్షకు మాత్రమే జరిగినట్లు తెలిపారు. ఈ ఏడాది సకాలంలో ప్రారంభించకపోవడం వల్ల రికవరీ తగ్గిందన్నారు. వచ్చే ఏడాదికైనా ఆధునికీకరణ చేపట్టి, టన్నుకు రూ.4 వేల మద్దతు ధర అందించాలని కోరారు.

దూరవిద్యలో ఏం జరుగుతోంది..?

- 21 నుంచి యూజీ, పీజీ పరీక్షలు
- కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు స్కెచ్
- అభ్యర్థుల నియామకంలో చక్రం తిప్పిన ఉద్యోగి
- అవకతవకలపై రిజిస్ట్రార్ ధనుంజయ రావు సీరియస్
- వాగ్దేవి దూరవిద్య పరీక్ష కేంద్రం రద్దు



ఏయూలోని డిస్టెన్స్ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: కొత్తవలసలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన డిస్టెన్స్ పరీక్షల్లో వాగ్దేవి కళాశాలలో అవకతవకలకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదులతో నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి మే 8 వరకు జరగనున్న యూజీ, పీజీ పరీక్షలకు ఈ కేంద్రం కేటాయించిన విద్యార్థులు కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే డిస్టెన్స్ విభాగం డిగ్రీ, పీజీ పరీక్షలపై గురువారం కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లతో డిస్టెన్స్ విభాగం డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్ ఏయూలోని సీడీవోఈ సెమినార్ హాల్లో సమావేశం నిర్వహించారు. దీనికి రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు కూడా హాజరై కేంద్రాల నిర్వాహకులకు క్లాస్ తీసుకున్నారు. పరీక్షల నిర్వహణ తీరు మెరుగుపడకపోతే, లెర్నింగ్ సెంటర్లలో పరీక్ష కేంద్రాలను తప్పించి, ప్రభుత్వ కాలేజీలనే పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేస్తామని హెచ్చరించారు.

అనుకూలమైన వారే అభ్యర్థులు

ఏయూ దూర విద్య విభాగం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 83 కేంద్రాలు ఉండగా, వీటి ద్వారా యూజీ 17,651 మంది, పీజీ 7,557 మంది ప్రవేశాలు పొందారు. వీరందరికీ ఈ నెల 21 నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే పరీక్షల్లో పెద్ద ఎత్తున మాస్‌కాపీయింగ్‌కు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల నియామకంలో డిస్టెన్స్ విభాగంలోని ఓ ఉద్యోగి చక్రం తిప్పి, డబ్బులు ముట్టజెప్పిన వారికి కావాల్సిన సెంటర్‌లో నియమించినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపగా డిస్టెన్స్ విభాగంలోని అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వసూళ్లతో.. మాస్ కాపీయింగ్

ఈ నెల 21 నుంచి జరిగే డిస్టెన్స్ పరీక్షలకు కేంద్రాల ఎంపిక పూర్తయింది. విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా జారీ అయ్యాయి. ఈ దశలో కొత్తవలసలోని వాగ్దేవి కాలేజీ కేంద్రాన్ని రద్దు చేయటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. గత సెమిస్టర్ పరీక్షల్లో జరిగిన లోపాలను మరుసటి సెమిస్టర్ పరీక్షలు జరిగేంత వరకు గుర్తించకపోవటం డిస్టెన్స్ విభాగంలో ఏదో జరుగుతోందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. డిస్టెన్స్ విధానంలో డిగ్రీ, పీజీ పరీక్షలు రాసే వారి నుంచి పేపరుకు ఇంత అని డబ్బులు వసూలు చేస్తూ, కొన్ని కేంద్రాల్లో పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నందునే.. ఈ రచ్చకు కారణంగా తెలుస్తోంది. ఏయూ పాలనాధికారులు ఇప్పటికైనా డిస్టెన్స్ పరీక్షల నిర్వహణపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

స్పీకర్ డాన్స్ చేస్తే ఒప్పు.. సర్పంచ్‌లు డాన్స్ వేస్తే తప్పా?

- పోలీసులను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే గణేష్



సర్కిల్ పోలీసు స్టేషన్‌లో పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు డాన్స్ చేస్తే ఒప్పు.... వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు డాన్స్ వేస్తే తప్పా అని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పోలీసులను ప్రశ్నించారు. సర్పంచ్‌లపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం పోలీసులకు తగదని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అక్రమ కేసులను ఎత్తివేయాలంటూ గురువారం నర్సీపట్నం రూరల్ సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు డాన్స్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అదే విధంగా తమ సర్పంచ్‌లు డాన్స్ చేశారని, నాతవరం మండలం, వల్సంపేట పండగలో స్పీకర్ బావమరిది డాన్స్ వేస్తే ఎందుకు కేసులు పెట్టలేదని పోలీసులను నిలదీశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాకవరపాలెం మండలం, చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందు, నర్సీపట్నం మండలం, గురందరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నంపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. చామంతిపురం గ్రామంలో ఈ నెల 12న గ్రామదేవత పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమానికి సర్పంచ్ పోలీసు అనుమతులు తీసుకున్నారన్నారు. సర్పంచ్ సరదాగా డాన్స్ వేస్తే పోలీసులు కేసు పెట్టారన్నారు. గురందరపాలెంలో గ్రామ దేవత పండగకు సర్పంచ్ వెంకటరత్నం పోలీసు అనుమతులతో డాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేశారన్నారు. అక్కడ కూడా సరదాగా డాన్స్ వేసిన సర్పంచ్‌పై అక్రమ కేసు పెట్టారన్నారు. సోషల్ మీడియా ఆధారంగా కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఎల్లకాలం ఒకే ప్రభుత్వం ఉండదన్న విషయాన్ని పోలీసులు గ్రహించాలని, ప్రజాశ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. ఆయన వెంట పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ సుర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ బోళం వెంకటేష్, నియోజకవర్గ నాయకులు సుర్ల శేఖర్, సుర్ల నాయుడు, బేతిరెడ్డి విజయ్, సన్నిబాబు, కణితి వాసు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం

- సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయాలి
- దర్యాప్తు పూర్తి చేసి న్యాయం చేయాలి
- అట్రాసిటీ కేసుల పురోగతిపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చెయ్యాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ఆమె నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కేసుల దర్యాప్తు పూర్తి చేసి నిర్దేశించిన సమయంలోగా చార్జిషీటు దాఖలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. అట్రాసిటీ కేసుల పురోగతిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఆయా శాఖల పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రాయితీ రుణాలు సత్వరమే అందించడం జరుగుతోందని, వారికి మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జనవరి నెల నుంచి మార్చి నెల వరకు 25 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని. ఇందులో 23 కేసులకు సంబంధించి రూ. 34.25 లక్షల పరిహారం మంజూరు చేశామన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్ణీత సమయంలో చార్జిషీట్లు వేసి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూస్తామన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి శిరీష రాణి, కమిటీ సభ్యులు ఆర్.మధుబాబు, గంగాధర్ మరియమ్మ, బి.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

దండం పెడతాం.. కూలి డబ్బులివ్వండి

- బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల నిరసన

దేవరాపల్లి: వాకపల్లిలో బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ కూలీలు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. చేతులు జోడించి దండం పెట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వేడుకున్నారు. 13 వారాలుగా కూలి సొమ్ము చెల్లించకుంటే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోజు కూలిపై ఆధారపడి జీవించే తామంతా అర్ధాకలితో అలమటిస్తున్నామని, తమ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. మండుటెండలో పనిచేస్తున్న తమకు కనీసం టెంట్ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమని పలువురు ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తట్ట, గునపాం, పార, తాగునీరు, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, వాటిని పూర్తిగా కట్ చేసి రూ.7 పెంచినట్లు ప్రకటించడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల నిరసనకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మద్దతు పలికారు. జిల్లావ్యాప్తంగా 13 వారాలకు రూ. 55 కోట్ల మేర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ కూలీల కష్టాన్ని అర్థం చేసుకోకపోవడం విచారకరమన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ చెప్పారని, కూలీలకు బిల్లుల చెల్లింపులో మొదటి స్థానంలో ఉండాలి కదా అని వెంకన్న ప్రశ్నించారు.

క్వారీ కార్మికుల సమ్మె విరమణ

- డిమాండ్లకు అంగీకరించిన క్వారీ యజమానులు



మాట్లాడుతున్న కోన మోహన్‌రావు

అనకాపల్లి: మండలంలో క్వారీ యాజమాన్యాలు ట్రాక్టర్ కంప్రెసర్ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ కార్మికులకు 11వ వేతన జీతాలు పెంచడం అభినందనీయమని జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన మోహన్‌రావు తెలిపారు. మండలంలో బవులవాడ పంచాయతీ దర్జీనగర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం కార్మికుల సమ్మె విరమణ సమావేశంలో ఆయన మాట్లాడారు. బవులవాడ, ఊడేరు, మార్టూరు, మాకవరం, పి. సంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లోని 150కి పైగా కంప్రెసర్ల డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేసే 500 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారన్నారు. కార్మికుడికి పెరిగిన కూలీ రేట్లు వల్ల ప్రస్తుతం వస్తున్న నెలవారి ఆదాయం రూ.2 వేల నుంచి రూ.3 వేలు పెంచడం జరిగిందన్నారు. క్వారీల ప్రమాదాల్లో కార్మికుడు మరణించినా, అంగవైకల్యానికి గురైనా అప్పటి పరిస్థితులకు అనుగుణంగా క్వారీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి గురై కార్మికుడు పనిచేయలేని స్థితిలో ఉంటే, అతడి కుటుంబ పోషణకు (వారానికి) రూ.1000 ఇచ్చేందుకుగాను అంగీకరించిందన్నారు. కంప్రెషర్ యజమానులు ప్రతీ కార్మికుడికి రూ.10 లక్షల వరకు ఇన్సూరెన్స్ చేయించేందుకు అంగీకార ఒప్పందం జరిగిందన్నారు. సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, సేనాపతి సూరిబాబు, ముమ్మిన శ్రీను, వీరేశలింగం, తదితరులు పాల్గొన్నారు.

తాడి గ్రామ సమస్య పరిష్కారానికి చర్యలు

- పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్‌పై కలెక్టర్ విజయకృష్ణన్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్

తుమ్మపాల: పరవాడ మండలం ఫార్మసిటీలో తాడి గ్రామ సమస్యను పరిష్కరించుటకు కృషి చేస్తానని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పరవాడ మండలంలో తాడి గ్రామ తరలింపు, పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ భూ సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ రెండు సమస్యల పరిష్కారం కోసం గతంలో తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గ్రామ తరలింపుపై జరిగిన సర్వేలో తేల్చిన లబ్ధిదారుల జాబితాను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు తయారు చేయాలన్నారు. అదేవిధంగా 20 ఏళ్లలో లబ్ధిదారులు కూడా పెరిగారని, తాడి తరలింపునకు కేటాయించిన స్థలానికి సంబంధించి కూడా నివేదిక తయారు తయారుచేసి ప్రభుత్వ ఆమోదానికి పంపాలన్నారు. దీనిపై మరలా పూర్తి సర్వే చేసి అతి తొందరలో గ్రామ తరలింపు జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. పెద్దముషిడివాడ ల్యాండ్ పూలింగ్ రైతులతో ఆమె మాట్లాడుతూ అతి తొందరలో నిజమైన హక్కుదారులకు త్వరగా న్యాయం జరిగేటట్టు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎయిర్ పోర్టులో నిర్వహించిన సమావేశంలో తాడి తరలింపుపై నివేదిక తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. తాను కూడా 2024 ఎన్నికల్లో గెలిచిన వెంటనే తాడి గ్రామాన్ని తరలిస్తానని హామీ ఇచ్చానన్నారు. ఏపీఐఐసీ హెచ్‌డి సి.అనిత, ఆర్డీవో షేక్ అయేషా, పరవాడ తహసీల్దారు అంబేడ్కర్, ఆయా గ్రామాల నాయకులు బొద్దపు శ్రీనివాస్, తాడి మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి అప్పారావు, గనిరెడ్డి కనకరాజు, గొల్లవిల్లి అచ్చిబాబు, బలిరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు, అర్ని అప్పారావు, బొండ అచ్చిబాబు, రావడా నాయుడు, శివశంకర్, కనకనాగేశ్వరావు, బాధితులు, రైతులు పాల్గొన్నారు.

వడ్డాది పోస్టాఫీసులో చోరీ

- షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 67,855 అపహరణ



వడ్డాది పోస్టాఫీసులో విచారణ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో పోస్టాఫీసు షట్టర్ తాళాలు పగులగొట్టి ప్రజలు దాచుకున్న నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. బుధవారం సాయంత్రం తాళాలు వేసుకుని వెళ్లిపోయిన సిబ్బంది గురువారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తీసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు, అదనపు ఎస్ఐ భాస్కరరావు తమ సిబ్బందితో విచారణ చేపట్టారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. పోస్టాఫీసు దగ్గరలో సీసీ కెమెరాలు లేకపోవడంతో వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో సీసీ కెమెరాలతోపాటు స్థానికులను విచారించి చోరీపై విచారణ చేస్తున్నారు. పోస్టాఫీసులో రూ. 67,855 పోయినట్లు బీపీఎం నాగేంద్ర తెలపగా, సెలవు నుంచి తిరిగి వచ్చిన బ్రాంచ్ మేనేజర్ రాంబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య



కృష్ణవేణి మృతదేహం

నర్సీపట్నం: మండలంలోని చెట్టుపల్లికి చెందిన అధికారి కృష్ణవేణి అలియాస్ సరోజిని (32) గురువారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్సై రాజారావు కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన అధికారి రాజేష్‌తో 12 ఏళ్ల క్రితం కృష్ణవేణికి వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడేళ్ల నుంచి భర్త రాజేష్ కృష్ణవేణిని వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో కృష్ణవేణి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



దిమిలి వెంకటలక్ష్మి

నక్కపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై కాగిత సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మరణించింది. ఎస్ఐ సన్నిబాబు వివరాల ప్రకారం.. మునగపాక మండలం ఒంపోలు గ్రామానికి చెందిన దిమిలి వెంకటలక్ష్మి(50) మోటారు సైకిల్‌పై తన కుమారుడితో కలిసి కాకినాడ జిల్లా కత్తిపూడి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కాగిత జాస్ హోటల్ సమీపంలో బైక్‌ను తన కుమారుడు నిర్లక్ష్యంగా వేగంగా నడపడంతో అదుపు తప్పి వెనుక కూర్చొన్న వెంకటలక్ష్మి కింద పడింది. దాంతో ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూరిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిన గృహోపకరణాలు

- రోడ్డున పడిన కుటుంబం
- రూ.4 లక్షలు ఆస్తి నష్టం



పూరింటి నుంచి ఎగసిపడుతున్న అగ్ని కీలలు

యలమంచిలి రూరల్: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాన్ని అగ్ని ప్రమాదం రోడ్డున పడేసింది. టీ కొట్టు నడుపుకుంటూ జీవిస్తున్న కుటుంబం నివాసముంటున్న పూరిల్లు అగ్నికి ఆహుతైన ఘటన యలమంచిలి పట్టణం కాకివాని వీధిలో గురువారం చోటు చేసుకుంది. కాలనీలో ఎర్రంశెట్టి రాజేశ్వరి కొడుకు సురేష్ కుటుంబం, కుమార్తె సంతానంతో కలిసి 8 మంది నివాసముంటున్నారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పూరింట్లో ఒక్కసారిగా ఇంటి పైకప్పు నుంచి నిప్పు రవ్వలు పడ్డాయి. రాజేశ్వరి కోడలు వెంకటలక్ష్మి మేల్కొని అగ్నిప్రమాదాన్ని గుర్తించి నిద్రపోతున్న కుటుంబ సభ్యులందర్నీ ఇంటి నుంచి బయటకు తీసుకొచ్చింది. సమాచారం మేరకు స్థానిక ఫైర్ ఆఫీసర్ డి. రాంబాబు హుటాహుటిన శకటంతో అక్కడకు చేరుకుని సిబ్బందితో మంటలార్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గృహోపకరణాలు, సర్టిఫికెట్లు, దుస్తులు, కొంత నగదు, బంగారు ఆభరణాలు కాలిబూడిదయ్యాయి. వీటి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందని భావిస్తున్నారు. పూరింటికి మిద్దె ఉండడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు.

ప్లానింగ్ కమిషన్‌కు ఎంపీపీ సూరిబాబు సూచనలు



ప్లానింగ్ కమిషన్ సభ్యులతో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు

అనకాపల్లి టౌన్: తిరుపతిలో గురువారం జరిగిన ప్రణాళికా సంఘం సమావేశంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు పాల్గొన్నారు. ప్లానింగ్ కమిషన్ సభ్యులకు ఎంపీపీ సూరిబాబు పలు అంశాలపై తన అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న జనాభాను పరిగణనలోకి తీసుకొని 16వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఆర్థిక సంఘం నిధులతో చేస్తున్న పనులకు జీఎస్టీ 18 శాతం రద్దు చేయాలని సూచించారు. ఈ నిధులను ఏ పనులకైనా ఖర్చు పెట్టే వెసులుబాటు కల్పించాలని, దీనివలన అత్యవసరమైన, సాధారణమైన పనులకు నిధులను వాడే సౌలభ్యం కలుగుతుందన్నారు. ఈ సిఫార్సులు అమలు జరిగితే గ్రామీణాభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వయం ప్రతిపత్తి మెరుగుపరచడానికి సహాయపడుతుందన్నారు.

వాహనాల మధ్య ఇరుక్కుని
డ్రైవర్ మృతి

చీడికాడ: రెండు వాహనాల మధ్య ఇరుక్కుని లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన చీడికాడలో గురువారం చోటు చేసుకుంది. ఇక్కడ లారీలో సిమెంట్‌ను మరొక వాహనంలోకి మార్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆగిఉన్న లారీ వద్దకు మరో వాహనాన్ని వెనక్కి నడపగా, పరవాడ మండలానికి చెందిన అదే లారీ డ్రైవర్ అప్పారావు ఈ రెండింటి మధ్య ఇరుక్కు పోయాడు. దీంతో అతడికి ఊపిరాడక గట్టిగా కేకలు వేశాడు. దాంతో మరో డ్రైవర్ గుర్తించి కొన ఊపిరితో ఉన్న అతడిని చోడవరం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బి.సతీష్ తెలిపారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌వో శాంతిప్రభ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతిప్రభ

అనకాపల్లి: గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, కాబోయే తల్లులు వైద్యుల సూచనల మేరకు సకాలంలో మందులు వాడడమే కాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఎం.శాంతిప్రభ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గురువారం మాత, శిశు మరణాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ నమోదు, క్రమానుగత తనిఖీలు, పోషణ, ఆస్పత్రి పరిసరాల విషయంలో వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు వైద్య సేవలు అందించలేదని తమ దృష్టికి వచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. మాత, శిశు మరణాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లాలో వివిధ ఆస్పత్రుల వైద్యాధికారులు బాలాజీ, జ్యోతి, ప్రశాంతి, చంద్రశేఖర్‌దేవ్, నాగమణి, శ్రీరాంపురం, తురకలపూడి, మాకవరపాలెం, అనకాపల్లి పీహెచ్‌ల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో ప్రవీణ్‌కుమార్ సత్తా



ఇళ్ల ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఐఆర్ గంగాధర్

అనకాపల్లి: విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అవినాష్ పవర్ జిమ్ చైర్మన్, న్యాయవాది ఐఆర్ గంగాధర్ అన్నారు. ఈ నెల 13న కృష్ణా జిల్లా గుడివాడలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీలలో జూనియర్ విభాగంలో జిమ్ సభ్యుడు ఇళ్ల ప్రవీణ్‌కుమార్(59 కేజీల విభాగం) ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం జిమ్‌లో కుమార్‌ను ఆయన సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రవీణ్‌కుమార్ త్వరలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిమ్ మేనేజర్ గొర్లి స్వామి గౌడ్, సభ్యులు గణేష్, పి.సంతోష్, శ్యామ్, కె.ప్రేమ్, అనిల్, రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో కె.ప్రభావతి, తదితరులు

అనకాపల్లి: గర్భిణులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో కె.ప్రభావతి కోరారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ పోషణ్ పక్వాడ మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషణ యాప్‌లో పేర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిర్మల, లక్ష్మి, వంశీప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్లు కింద జంగిల్ క్లియరెన్స్, మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్–2 ఫీడర్ పరిధిలో నెహ్రూ చౌక్ నుంచి పూడిమడక జాతీయ రహదారి, శారదా కాలనీ, ఉమ్మలాడ ఏరియా, తహసీల్దార్ కార్యాలయం రహదారి, విజయరామరాజుపేట ఫీడర్ పరిధిలో అంజయ్యకాలనీ, విద్యుత్‌నగర్, ఇన్‌కమ్ ట్యాక్స్ వీధి, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 1,717 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠధర	గరిష్ఠధర
స్పెషల్ రకం	4,480	4,480
మొదటి రకం	3,770	4,240
రెండో రకం	3,300	4,060
మూడో రకం	3,100	3,290

అనకాపల్లి సినిమాలు


రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : ఒక్కడు
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు , బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-20, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 334 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.



వేసవి తాపం.. పుచ్చకాయతో ఉపశమనం

- అనకాపల్లిలో జోరుగా వ్యాపారం
- కాయ సైజును బట్టి కిలో రూ.30 నుంచి విక్రయాలు
- ఆరోగ్యానికి మంచిదని చెబుతున్న వైద్యులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద పుచ్చకాయలు

అనకాపల్లి: ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు దాదాపు 36 డిగ్రీలు పైగా నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలను జనం ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి, పూడిమడక జాతీయ రహదారి నుంచి గుండాల జంక్షన్ వరకూ రహదారులకు ఇరువైపులా పుచ్చకాయలు వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. మొదటిలో కిలో పుచ్చకాయ రూ.80 ఉండగా, ప్రస్తుతం కిలో రకాన్ని బట్టి రూ.30 నుంచి రూ.50 వరకూ అమ్మకాలు సాగుతున్నాయి. రోజుకు పట్టణ పరిధిలో సుమారుగా రూ.20 లక్షల వ్యాపారం సాగుతోంది.

పుచ్చకాయతో ఆరోగ్య ప్రయోజనాలు

పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. డీహైడ్రేషన్ నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. శరీరానికి కావాల్సిన విటమిన్లు అందిస్తుంది. క్యాన్సర్ లక్షణాలను నివారిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. అందుకే వేసవిలో ఎక్కువగా దొరికే పుచ్చకాయను మిస్ చేసుకోవద్దు.



సుంకరమెట్ట జంక్షన్ వద్ద పుచ్చకాయలు

వేసవి తాపాన్ని తగ్గించడానికి పుచ్చకాయ చాలా సహాయపడుతుంది. సహజంగా పుచ్చకాయని తినేసి గింజలను మాత్రం పారేస్తూ ఉంటారు. కానీ పుచ్చకాయ గింజల్లో కూడా చాలా పోషకాలు ఉంటాయి. గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. అధిక రక్తపోటు తగ్గించడానికి, గుండె ఆరోగ్యంగా ఉండడానికి సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తిని ఇస్తుంది. శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల బారి నుంచి రక్షిస్తుంది. గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ప్రోటీన్ ఫ్యాటీ ఆసిడ్స్ అధికంగా ఉండటం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. గింజల్ని ఎండబెట్టి చక్కగా పైన పొట్టుతీసేసి నేరుగా తినవచ్చును. ఎండబెట్టి పొడి చేసి పాలలో కలిపి తాగవచ్చు. ఇలా చేయడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి.

ఆరోగ్యానికి చాలా మంచిది..



పుచ్చకాయలు వేసవి తాపం నుంచి రక్షిస్తాయి. మార్చి చివరలో కేజీ పుచ్చకాయ రూ.40 కొన్నాను. ప్రస్తుతం పుచ్చకాయ రకాన్ని బట్టి ధర నిర్ణయించారు. పుచ్చకాయలో ఎక్కువ నీరు శాతం ఉంటుంది. ఆరోగ్యానికి చాలా మంచిది.

– నగిరెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి

ఈ ఏడాది వ్యాపారం బాగుంది..



పదేళ్లుగా పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నాను. గతేడాది కంటే ఈ ఏడాది వ్యాపారం బాగుంది. రోజుకు సుమారుగా రూ.2 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఖర్చులు పోను రూ.600 మిగులుతుంది. వర్షం పడితే కాయలు కొద్దిగా పాడైపోయే అవకాశాలు ఉన్నాయి.

– పి.రాజు, పుచ్చకాయల వ్యాపారి, అనకాపల్లి

మానవ తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు



సిలిండర్ నుంచి వచ్చిన మంటలను అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక ఉద్యోగులు

అనకాపల్లి: మానవుని జీవితంలో చిన్నపాటి తప్పిదాల వల్లే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి పి.నాగేశ్వరరావు అన్నారు. జాతీయ అగ్నిప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక జీఎంజే హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో భయపడకుండా మంటలను అదుపు చేసేందుకు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వాలి

అనకాపల్లి: రాష్ట్రంలో ఈ నెల 23న 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా పర్యటన ఉందని, రాష్ట్రంలో ఎంపీలు అందరూ రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సాధించి, సంఘానికి నివేదిక ఇవ్వాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర షరతుల మేరకు అమలు చేస్తున్న సంస్కరణలు వల్ల రాష్ట్రం ఆర్థిక లోటుతో పాటు తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిధుల కేటాయింపులో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ట్యాక్స్‌ల రూపంతో వస్తున్న నిధులలో 50 శాతం వాటా రాష్ట్రాలకు ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని తక్షణమే అమలు చేయాలని, ఆర్థిక లోటును భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ప్రధాని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ట్రైబల్ సబ్ ప్లాన్‌లో 90 శాతం నిధులను కేంద్రమే భరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి నిధులు కేటాయించాలని, ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని కోరారు. విశాఖలో రైల్వే జోన్ పనులకు వేగవంతం చేయాలన్నారు.

అనకాపల్లి కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రావాలి



ఆర్టీసీ కార్యాలయంలో ఏవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: ఆర్టీసీ అధికారులు ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను జిల్లా కేంద్రమైన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో ఏవో ఎస్.వెంకటేశ్వరరావును ఆయన గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడిమడక జాతీయ రహదారిలో ప్రయాణికులు ఎండ, వానలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నారని చెప్పారు. అక్కడ చిన్నపాటి బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రం అవక ముందు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు దూర ప్రాంతాల ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు వచ్చేవని చెప్పారు. ప్రస్తుతం ఆయా బస్సులు జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోవడంతో ప్రయాణికులు పూడిమడక జాతీయ రహదాకి వెళ్లే అక్కడ బస్సులను ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం, తిరుపతి, శ్రీశైలం, హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూర్ వెళ్లే ప్రయాణికులు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేషగుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం రాత్రి 9 నుంచి 11 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 60 ప్రధాన కూడళ్ల వద్ద 360 మంది పోలీసులతో బృందాలుగా ఏర్పడి ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లాలో పలు కూడళ్లలో ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా తనిఖీలు చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, అధిక లోడ్ ఉన్న వాహనాలు, వాహన రికార్డుల పరిశీలన, పెండింగ్ చలాన్ల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.


ఎక్స్‌పోజర్ విజిట్‌లో విద్యార్థులు



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం: విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, అభ్యాస అంశాలపై అవగాహన పెంచేందుకు ఎక్స్‌పోజర్ విజిట్(సందర్శన) ఎంతగానో దోహదపడుతుందని మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు అన్నారు. మండలంలో ఎంపిక చేసిన 5 ప్రాథమిక పాఠశాలల నుంచి 5గురు బాలురు, 5గురు బాలికలు కలిపి మొత్తం 10 మంది విద్యార్థులను ఈ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలతో కలిసి గురువారం తీసుకెళ్లారు. విద్యార్థులను మండల కేంద్రంలోని గ్రంథాలయం, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫైర్ స్టేషన్లకు తీసుకెళ్లారు. అక్కడి దైనందిన వ్యవహారాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి శిరీష, స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.రమణ, వైద్యాధికారి ఎం.సత్యదీపిక, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.అప్పలనాయుడులు తమ శాఖలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు ఎస్‌కే అజహరుద్దీన్, బి.పావని, డి.నాగేశ్వరరావు, ఇ.వెంకటరావు, కేవీ రమణ, సీఆర్‌ఎంటీ ఎస్ కళాభారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

పరవాడ: మండలంలోనిరావాడ శివారు ధర్మారాయుడుపేటలో కొలువైన దుర్గమాంబ పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో జరిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు కావలి రాజు, కావలి వాసు, జమ్ముల అశోక్, పల్లా గోవిందు, కోన రాము అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. భక్తుల కోసం ఆలయం వద్ద మంచినీరు, ఉచిత ప్రసాదం ఏర్పాట్లు చేశారు. రాత్రికి అమ్మవారిని డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెట గుళ్లు, డ్యాన్సులతో పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ బాణ సంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన



గొర్లె రాధిక, శ్రీలలితల బృందం కోలాటం ప్రదర్శన

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఉత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మైదానంలో 21రోజు గురువారం రాత్రి ప్రదర్శించిన కోలాటం ఆహూతులను అలరించింది. విశాఖపట్నం ఆర్కెస్ట్రా, కూచిపూడి నృత్య అకాడమీ, గణపతి కోలాటం బృందం, గాజువాక శ్రీ రమ్య రిషిత చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ గ్రంధి శేషుకుమార్, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, కమిటీ సభ్యులు, నిర్వాహకులు విల్లూరి హరికృష్ణ, తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కశింకోట: కశింకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు దృష్ట్యా కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మునగపాకలో తప్పిన ప్రమాదం



చెట్టును ఢీకొన్న లారీ

మునగపాక: మునగపాక సమీపంలో ప్రమాదం తప్పింది. గురువారం అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు లోడుతో లారీ వెళ్తుంది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న చెట్టును లారీ ఢీకొంది. అయితే ఈ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

సీపీఎం నాయకుడు 'మళ్ల'కు ఘన నివాళి



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు మళ్ల సత్యనారాయణ ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సత్యనారాయణ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్, బెల్లం మార్కెట్, కొలగార్లు, కలాసీ కార్మిక సంఘాలను నెలకొల్పి వారి సమస్యలపై అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మళ్ళ జగన్మోహన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కశింకోట: రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖలో జరగనున్న రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను కశింకోటలో గురువారం ఆవిష్కరించారు. రైల్వేలో భద్రతా చర్యలు చేపట్టాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు విశాఖలో దాబాగార్డెన్స్ వద్ద అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సులో ఉద్యోగులు, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శంకర్, జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ప్రతినిధులు జె.రవి, సిహెచ్.పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చియ్యపేటలో రోడ్డు ప్రారంభం



బుచ్చియ్యపేటలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన శారదా వనంను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మండలంలోని బయ్యవరంలో అటవీ శాఖ ప్రాంతంలో నిర్మించిన శారదా వనాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఫారం పాండ్, వాకింగ్ ట్రాక్, బొటానికల్ గార్డెన్, నర్సరీలను సందర్శకుల కోసం అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. అటవీ శాఖ అధికారి జ్యోతిర్మయి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ముందుగా బుచ్చియ్యపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

మట్టి నమూనా పరీక్షలతో మేలు



మట్టి నమూనా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంట భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.రామారావు సూచించారు. మండలంలోని తోటాడ, వాడ్రాపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. తోటాడలో మట్టి నమూనా పరీక్షలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే వాడ్రాపల్లిలో వరి, నువ్వు పంట సాగును పరిశీలించి, పంట చేతికి అందివచ్చే తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మట్టి నమూనాల సేకరణ, ఆవశ్యకతపై రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏఈవో ఎస్.లక్ష్మి, పద్మిని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్సీలో సీఆర్‌ఎంటీలకు వెయిటేజీ ఇవ్వాలి



డీఎస్సీలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డుల ప్రదర్శన చేస్తున్న సీఆర్‌ఎంటీలు

మునగపాక: రానున్న డీఎస్సీలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల సీఆర్‌ఎంటీలు గురువారం ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. బీఈడీ అర్హత కలిగి 13 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు వెయిటేజీ కల్పించి సాయం చేయాలని కోరారు. తమ సర్వీసును పరిగణనలోకి తీసుకొని డీఎస్సీలో వెయిటేజీ ఇచ్చేలా చూడాలని సీఆర్‌ఎంటీలు అచ్యుతకృష్ణ, లక్ష్మీనారాయణ, గోవింద, నూకేష్ తదితరులు కోరారు.